క్లుప్తంగా

తాటాకులకు గిరాకీ



ఎద్దుల బండిలో తాటాకులను తరలిస్తూ..

ముత్తుకూరు: సోమవారం భోగి పండగ సందర్భంగా మంటలు వేసేందుకు అవసరమైన తాటాకులకు గిరాకీ ఏర్పడింది. కొద్దిరోజుల ముందే పల్లెల్లో కూలీల ద్వారా తాటిచెట్లపై ఆకులు కోసి ఎండబెట్టారు. వాటిని చిన్నమోపులు కట్టి నెల్లూరు తదితర ప్రాంతాలకు లారీలు, ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ద్వారా తరలిస్తున్నారు. ముత్తుకూరు పరిసర గ్రామాల నుంచి అమ్మకాలకు రవాణా చేస్తున్నారు.



కోవూరులో..

కోవూరు: భోగి పండగ సందర్భంగా మండలంలో తాటాకుల విక్రయాలు జోరందుకున్నాయి. పండగ సోమవారమైనా పలువురు శనివారమే వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

దుప్పట్ల పంపిణీ



మనుబోలు: సేవానాథం ట్రస్ట్ ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సూచనలతో సభ్యులు శనివారం మనుబోలు మండల కేంద్రంలోని ఏకలవ్య కాలనీలో దుప్పట్లు పంపిణీ చేశారు. విడతల వారీగా వెయ్యి మందికి దుప్పట్లు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మహీధర్‌రెడ్డి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి జయంతి సందర్భంగా..



రావి ఆకుపై..



కుంకుడు ఆకుపై..

ముత్తుకూరు: మండలంలోని నారికేళపల్లి పంచాయతీలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం శనివారం రావి ఆకుపై వివేకానందుడి చిత్రాన్ని గీశారు.

➡ **పొదలకూరు:** మహ్మదాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య కుంకుడు ఆకుపై స్వామి వివేకానంద చిత్రాన్ని గీశారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని వేసినట్లు ఆయన తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



యువకులతో మాట్లాడుతున్న ఎస్సై

మనుబోలు: మండలంలోని మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్ఎస్ఆర్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎస్సై శివరాకేష్ ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.15 వేలు బహుమతులను ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అందజేస్తారని తెలిపారు. మొదటి మ్యాచ్ యాచవరం – మనుబోలు కింగ్స్ జట్ల మధ్య జరిగింది. మనుబోలు కింగ్స్ జట్టు విజయం సాధించింది.

చౌకచర్లలో రక్తదాన శిబిరం



విడవలూరు: మండలంలోని చౌకచర్లలో మెగా రక్తదాన శిబిరాన్ని మలిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో విడవలూరు రెడ్‌క్రాస్, చౌకచర్ల యూత్ సహకారంతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి మాట్లాడారు. 51 యూనిట్ల రక్తాన్ని సేకరించి నెల్లూరు రెడ్‌క్రాస్‌కు అందజేశామని చెప్పారు. కార్యక్రమానికి సహకరించిన మనసేవా సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, పోలిరెడ్డి అశోక్‌రెడ్డి, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, నగళ్ల మధుసూదన్‌కు కృతజ్ఞతలను తెలియజేశారు.

విద్యార్థులపై చిన్నచూపు

- 2009 – 10లో టీపీగూడూరులో జూనియర్ కాలేజీ ఏర్పాటు
- ల్యాబ్ సౌకర్యం లేదు
- రెగ్యులర్ అధ్యాపకుల నియామకం జరగలేదు
- రికార్డ్ అసిస్టెంట్ లేక తీవ్ర ఇబ్బందులు



కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

తోటపల్లిగూడూరు: విద్యారంగంలోని సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తోంది. మండల కేంద్రంలో 2009 – 10 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సీఈసీ, ఎంపీసీ గ్రూపులకు సంబంధించి తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన జరుగుతోంది. 27 మంది విద్యార్థులతో కళాశాల ప్రారంభం కాగా నేడు ఆ సంఖ్య 200 దాటింది. ఆరేళ్లపాటు తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నాలుగు రేకుల షెడ్ల గదుల్లో తరగతులను నిర్వహించారు. తర్వాత నూతనంగా నిర్మించిన భవనంలోకి కళాశాల మారింది. ఇన్నాళ్లూ ఇరుకైన రేకుల షెడ్‌లో ఇబ్బందుల నడుమ విద్యాభ్యాసం సాగించిన విద్యార్థులకు ఊరట లభించింది. అయితే ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకాలు ఇంకా జరగలేదు.

ఎంతోమంది

తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటి వరకు పదిమంది ప్రిన్సిపల్స్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వీరంతా ఇన్‌చార్జిలుగా పనిచేసిన వారే. రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నా ప్రయోజనం ఉండటం లేదు. అలాగే కళాశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు విధుల్లో ఉంది కాంట్రాక్ట్ అధ్యాపకులే. ప్రస్తుతం ఏడుగురు ఆ విధంగా పనిచేస్తున్నారు. ఇటు ప్రిన్సిపల్, ఇటు అధ్యాపకులు రెగ్యులర్ కాకపోవడంతో నిర్వహణాపరంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. 200 మందికి పైగా విద్యార్థులున్న కాలేజీలో రికార్డు అసిస్టెంట్ లేకపోవడంతో మిగిలిన సిబ్బందిపై భారం పడుతోంది. ప్రిన్సిపల్ ఓవైపు తన బాధ్యతలు, మరోవైపు అధ్యాపకుడిగా విధులు, అలాగే రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేయాల్సి వస్తోంది. ఇక్కడ ల్యాబ్ సౌకర్యం లేకపోవడంతో ఎంపీసీ విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాయామ అధ్యాపకుడు లేకపోవడంతో స్టూడెంట్ దూరమయ్యారు. వాచ్‌మెన్ లేకపోవడంతో కళాశాల అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతోంది. ఈ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైమంది.

ఫలితాల్లో భేష్

ఫలితాల విషయంలో మాత్రం తోటపల్లిగూడూరు ప్రభుత్వ కళాశాల కార్పొరేట్ కళాశాలతో పోటీ పడుతోంది. 2009 – 10లో 90 శాతం, 2010 – 11లో 68, 2011 – 12లో 85, 2012 – 13లో 87, 2013 – 14లో 92, 2014 – 15లో నూరు శాతం, 2015 – 16లో నూరు శాతం, 2016 – 17లో 92, 2017 – 18లో 94, 2018 – 19లో నూరు శాతం, 2019 – 20లో 98, 2020 – 21లో 96, 2021 – 22లో 98, 2023 – 24లో నూరు శాతం ఫలితాలొచ్చాయి.

విన్నవించా..



కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకుల నియామకం, అదనపు గదుల నిర్మాణం, ల్యాబ్ సౌకర్యం కోసం ఉన్నతాధికారులకు విన్నవించాం. ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉత్తమ బోధన అందిస్తున్నారు. వీరి చొరవతోనే మంచి ఫలితాలను సాధిస్తున్నాం. సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయి.

– ధనుంజయ, ఇన్‌చార్జి ప్రిన్సిపల్, తోటపల్లిగూడూరు ప్రభుత్వ కళాశాల



తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

హైవేపై లారీ బోల్తా

- ఇద్దరికి గాయాలు
- గంటకుపైగా ట్రాఫిక్ జామ్



ఘటనా స్థలంలో లారీ

మనుబోలు: మండలంలోని మనుబోలు బైపాస్ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. చిత్తూరు నుంచి నెల్లూరు వైపు ఖాళీ కోళ్ల లారీ వెళ్తోంది. అతి వేగం కారణంగా అదుపుతప్పి హైవేపై అడ్డంగా బోల్తా పడింది. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై రాకేష్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శనివారం జరిగింది. వివరాలు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వెంకటేష్ పని నిమిత్తం గొలగమూడికి బైక్‌పై బయలుదేరాడు. సర్వేపల్లి కాలువ సమీపంలో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో అతను గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

తోడేరు ప్రజల అభిమానాన్ని మరువలేం



స్థానికులతో పూజితారెడ్డి

పొదలకూరు: తోడేరు గ్రామ ప్రజల అభిమానాన్ని ఎన్నటికీ మరువలేమని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితారెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని తోడేరు పంచాయతీ తోడేరు, రత్నగిరి, తోడేరు దళితవాడ, శాంతినగర్, వీవర్స్ కాలనీల్లో శనివారం పూజిత పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోడేరు పంచాయతీ ప్రజలు విలువలు, విశ్వసనీయతకు మారుపేరన్నారు. అందువల్లే తన తండ్రి రెండు పర్యాయాలు సర్వేపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించగలిగినట్లు తెలిపారు. తాము ఏ స్థాయిలో ఉన్నా గ్రామాన్ని మరిచిపోయేది లేదని, ఇక్కడి నుంచే తమ రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. సంక్రాంతి పండగను పంచాయతీ ప్రజలు ఆనందంగా జరుపుకోవాల్సిందిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్‌రెడ్డి, పొదలకూరు ఎంపీటీసీ జి.లక్ష్మీకల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఉప సర్పంచ్ ఎం.శ్రీనివాసులు, యస్దాని, ఎ.రవీంద్ర, ఎస్కే అంజాద్, ఎ.లోకేశ్, ఖాదర్, భాస్కర్ పాల్గొన్నారు.

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు



కొడవలూరు: వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో..



కోవూరు: గీతాంజలిలో..

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను శనివారం నిర్వహించారు. రంగవల్లులు, తాడులాగుడు, పతంగుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక, కోలాట ప్రదర్శనలు అలరించాయి. వ్యాఖ్యాతగా బుల్లితెర నటుడు రవి వ్యవహరించారు. కళాశాల చైర్మన్ గుణశేఖర్, శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, ఏఓ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: మండలంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. భోగి మంట వేసి రంగవల్లులను తీర్చిదిద్దారు. కళాశాల సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని కలిసిన వెంకటశేషయ్య



వెంకటాచలం: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య కలిశారు. బెయిల్‌పై విడుదలైన అయన శనివారం ఉదయం కాకాణిని నెల్లూరు నగరంలోని క్యాంప్ కార్యాలయంలో కలిశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కొడవలూరు: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ సుజాత ఆదేశించారు. మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టొచ్చని చెప్పారు. నిర్దేశిత సమయంలోపు వ్యాక్సినేషన్‌ను పూర్తి చేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కావ్య, కామాక్షయ్య, ఎస్సెన్ స్వర్ణలత, ఏఎన్ఎం సుకన్య, హెచ్‌ఏ సురేష్ పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి, కామాక్షితాయిని హైకోర్టు న్యాయమూర్తి వెంకటశేషసాయి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ మర్యాదలతో ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికారు. విశేష పూజలు చేశారు. శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



పొదలకూరు: మండలంలోని అంకుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కాసరం నారాయణరెడ్డి (90) శనివారం మృతిచెందారు. ఆయన భౌతిక కాయానికి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాళులర్పించారు. కాకాణి వెంట పార్టీ నాయకులు రామిరెడ్డి, లోకనాథంరెడ్డి, వై.శ్రీనివాసులురెడ్డి, కార్యకర్తలున్నారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం



నవీన్‌రెడ్డి (విడవలూరు)



అనూప్‌రెడ్డి (కోవూరు)



శేషగిరి (కొడవలూరు)



విష్ణువర్ధన్‌రెడ్డి (ముత్తుకూరు)



మోహన్‌నాయుడు (వెంకటాచలం)



రమణారెడ్డి (పొదలకూరు)



శంకరయ్యగౌడ్ (టీపీగూడూరు)



హరగోపాల్‌రెడ్డి (మనుబోలు)



శ్రీనివాసులురెడ్డి (ఇందుకూరుపేట)

విడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులుగా పలువుర్ని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను శనివారం జారీ చేసింది.

➡ పార్టీ విడవలూరు మండలాధ్యక్షుడిగా కాటంరెడ్డి నవీన్‌రెడ్డిని నియమించారు. తనపై నమ్మకంతో పదవిని పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అప్పగించారని, వీరికి రుణపడి ఉంటానని చెప్పారు. నేతలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

➡ **కోవూరు:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవూరు మండలాధ్యక్షుడిగా అత్తిపల్లి అనూప్‌రెడ్డిని నియమించారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడతానని తెలిపారు.

➡ **కొడవలూరు:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొడవలూరు మండలాధ్యక్షుడిగా దామేగుంటకు చెందిన చిమటా శేషగిరి నియమితులయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచే పార్టీ కోసం కష్టపడి పనిచేసే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సతీమణి హరిత గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

➡ **ఇందుకూరుపేట:** పార్టీ మండలాధ్యక్షుడిగా మావులూరు శ్రీనివాసులురెడ్డిని నియమించారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలను తెలియజేశారు.

➡ **ముత్తుకూరు:** వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయనే కొనసాగుతున్నారు. మరోసారి నియమించారు.

➡ **పొదలకూరు:** వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా పెదమల్లు రమణారెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. పెదమల్లుకు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. మాజీ మంత్రి కాకాణి కుటుంబానికి ఆప్తుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. మండలాధ్యక్షుడిగా రమణారెడ్డి చాలా కాలం కొనసాగి తిరిగి నియమితులయ్యారు. వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్నారు.

➡ **తోటపల్లిగూడూరు:** వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా ఉప్పల శంకరయ్య గౌడ్ నియమితులయ్యారు. ఆయనది వరకవిపూడి పంచాయతీ అనంతపురం గ్రామం. బీసీ సామాజికవర్గానికి చెందిన నేత. ఎనిమిదేళ్లుగా ఆ బాధ్యతలు చూస్తున్నారు. పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో అధిష్టానం మరోసారి శంకరయ్య గౌడ్‌కే బాధ్యతలను అప్పగించింది.

➡ **వెంకటాచలం:** వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా కొణిదెన మోహన్‌నాయుడు నియమితులయ్యారు. ఇప్పటికే కొనసాగుతున్న ఆయన్ను మరోసారి నియమించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మోహన్‌నాయుడు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

➡ **మనుబోలు:** వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటికే బాధ్యతల్లో ఉన్న ఆయన్ను మరోసారి నియమించారు. దీంతో పలువురు నాయకులు హరగోపాల్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

తోటపల్లిగూడూరు: సంక్రాంతి సందర్భంగా ఎక్కడైనా కోడిపందేలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. పోలీస్ అధికారులు శనివారం మండలంలోని వెంకన్నపాళెం పట్టపుపాళెం, ముత్యాలపాళెం, వెంకటేశ్వర పట్టపుపాళెం, పాతపాళెం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. జూదం నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు సీఐ రవినాయక్, ఎస్సై వీరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని దామరమడుగులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు శనివారం ఆవిష్కరించారు. తొలుత స్థానిక శివాలయానికి వెళ్లిన వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఏటూరి శివరామకృష్ణారెడ్డి, బత్తుల హరికృష్ణ, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతుల ప్రదానం



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాలలో గల నెహ్రూనగర్‌లో ఎమ్మెమ్మీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులను శనివారం అందజేశారు. నెహ్రూనగర్‌కు చెందిన ఎమ్మెమ్మీసీ గ్రూప్, ప్రగతినగర్ శివ గ్రూప్ మొదటి రెండు స్థానాల్లో నిలిచాయని టోర్నీ నిర్వాహకుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వీరికి బహుమతులను యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు అందజేశారు. కమిటీ మెంబర్లు సోమశేఖర్, హఫీజ్, చెంచయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

మనుబోలు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత విష్ణాలయంలో ద్వాదశ పూజలను శనివారం నిర్వహించారు. అర్చకులు మాధవగిరి హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమాలకు కోడూరు సుబ్బరాయుడు – పద్మావతమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

➡ మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న వెంకయ్య స్వామి ఆలయంలో శనివారం అర్చకులు శ్రీనివాసులు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు గంధళ్ల కృష్ణయ్య – అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



మనుబోలు: శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

➡ **పొదలకూరు:** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి, అమ్మవార్ల పల్లకి సేవ వైభవంగా జరిగింది. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో తెల్లవారుజామున ధనుర్మాస పూజలు చేశారు.



మనుబోలు: ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి



పొదలకూరులో..